సాక్షి కర్నూలు

శనివారం । 4 । జనవరి । 2025

I



భ్రామరీకి ఊయలసేవ

శ్రీశైలంటెంపుల్: శ్రీ భ్రమరాంబాదేవికి దేవస్థాన అర్చకులు శుక్రవారం ఊయలసేవ నిర్వహించారు. ముందుగా లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ అర్చక స్వాములు సేవా సంకల్పం పఠించారు.



ప్రాణదాన ట్రస్ట్‌కు విరాళం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహించే ప్రాణదాన ట్రస్ట్‌కు శుక్రవారం హైదరాబాద్‌కు చెందిన కె.హరగోపాల్ రూ.1,00,116 విరాళం అందజేశారు.



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం (అడుగులు)	: 1,633
ప్రస్తుతం	: 1,625.63
సామర్థ్యం (టీఎంసీలు)	: 105.788
ప్రస్తుతం	: 78.572
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 140
అవుట్ ఫ్లో	: 8,818

న్యూస్‌రీల్

నీటి వనరుల ఆక్రమణలను తొలగించాలి



మాట్లాడుతున్న జేసీ డాక్టర్ నవ్య

కర్నూలు(సెంట్రల్): జిల్లాలో నీటి వనరులకు సంబంధించిన ఆక్రమణలను వెంటనే తొలగించాలని జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో నీటి వనరులు, చెరువుల భూముల జిల్లా స్థాయి పరిరక్షణ కమిటీతో జేసీ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నీటి వనరులైన నదులు, చెరువులు, వంకలు, వాగులకు సంబంధించి సమీపంలో ఎలాంటి ఆక్రమణలు ఉన్నా, వాటిపై సర్వే చేసి పూర్తి వివరాలను 5వ తేదీలోపు సమర్పించాలని ఆదేశించారు. రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు సంయుక్తంగా సర్వే చేపట్టాలన్నారు. మునిసిపాలిటీల్లో ఆక్రమణలపై కూడా సర్వే చేసి నివేదిక ఇవ్వాలన్నారు. నీటి వనరుల సమీపంలో బఫర్ జోన్‌ను గుర్తించి ఆయా ప్రాంతాల్లో ప్లాంటేషన్‌ను చేపట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో డీఆర్వో సి.వెంకట నారాయణమ్మ, కర్నూలు ఆర్డీఓ సందీప్‌కుమార్, డీపీఓ భాస్కర్, మునిసిపల్ కమిషనర్ రవీంద్రబాబు పాల్గొన్నారు.

బీఈడీ రెండో సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో బీఈడీ రెండో సెమిస్టర్ పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 17 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించారు. 3,850 మందికి గాను 3,560 మంది హాజరు కాగా 325 మంది ఛాత్రోపాధ్యాయులు గైర్హాజరయ్యారని వర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు తెలిపారు. 91.60 శాతం హాజరు నమోదైనట్లు పేర్కొన్నారు. మొదటి రోజు పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని తెలిపారు.

బనవాసి ఏపీఆర్‌జేసీ ప్రిన్సిపాల్ సస్పెన్షన్

ఎమ్మిగనూరురూరల్: బనవాసి ఏపీ గురుకుల బాలికల జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ శ్రీనివాసగుప్తాను సస్పెండ్ చేసినట్లు కాలేజీ ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ గిరివాణి తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ.. కాలేజీలో విద్యార్థినిని లైబ్రేరియన్ వేధించిన ఘటనలో ప్రిన్సిపాల్‌ను బాధ్యుడిని చేస్తూ గురుకుల కాలేజీ సొసైటీ కమిషనర్ సస్పెండ్ చేశారన్నారు. అలాగే విద్యార్థినుల విన్నపం మేరకు ముగ్గురు పురుష గెస్ట్ ఫ్యాకల్టీలు, ఒక లైబ్రేరియన్, మహిళా పీడీని కూడా విధుల నుంచి తొలగించినట్లు తెలిపారు. కాలేజీలో మొత్తం స్టాఫ్ మహిళలే ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు.

జూనియర్ కాలేజీల్లో నేటి నుంచి మధ్యాహ్న భోజనం

కర్నూల సిటీ: ప్రభుత్వ స్కూళ్లలో చదువుతున్న విద్యార్థులకు అమలు చేస్తున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని శనివారం జూనియర్ కాలేజీ విద్యార్థులకు సైతం అమలు చేయనున్నారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు. జిల్లాలోని 23 ప్రభుత్వం జూనియర్, ఒకేషనల్ కాలేజీల్లో మాత్రమే ఈ పథకాన్ని అమలు చేయనున్నారు.

సాంకేతిక లోపంలో నిలిచిన వాస్కోడిగామా ఎక్స్‌ప్రెస్

కోసిగి: వాస్కోడిగామా నుంచి జాషిద్ (17321)కు వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైలు శుక్రవారం సాంకేతిక లోపంతో కోసిగి రైల్వే స్టేషన్ సమీపంలో నిలిచిపోయింది. సాయంత్రం ఈ రైలు కోసిగి మీదుగా రాయచూరు వైపు వెళ్తుండగా బీ4 ఏసీ బోగి అడుగు భాగంలో రాపిడికి నిప్పురవ్వలు రావడాన్ని పైలెట్ గుర్తించారు. అతను రాయచూరు రైల్వే స్టేషన్ ఇంజినీర్లతో సంప్రదించగా.. తక్కువ స్పీడ్‌తో రమ్మని ఆదేశాలు ఇవ్వడంతో 40 కి.మీ స్పీడ్‌తో రాయచూరుకు వెళ్లాడు. అయితే రైల్వే గేటు వద్ద సాయంత్రం 5.30 గంటల నుంచి గంటల నుంచి 6.10 గంటల వరకు (దాదాపు 40 నిమిషాలు) పాటు రైలు నిలిచిపోవడం వాహనదారులు గేటు తెరిచే వరకు నిరీక్షించారు.

అక్రమార్కులకు ఉపాధి

- ఉపాధి పనులతో జేబులు నింపుకుంటున్న టీడీపీ నేతలు, కొందరు సిబ్బంది
- ఫీల్డ్ అసిస్టెంట్లందరూ తెలుగుదేశం కార్యకర్తలే
- కుటుంబానికి అందని 100 రోజుల పని
- 25 నుంచి 30 శాతం వరకు దొంగ మస్టర్లే
- పనుల్లేక ఇప్పటికే ఉమ్మడి జిల్లా నుంచి లక్ష కుటుంబాలు వలసబాట



తుగ్గలి మండలంలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం పేదలకు 'ఉపాధి' హామీ ఇవ్వడం లేదు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఏటా లక్ష కుటుంబాలకు వంద రోజుల పని కల్పించాల్సి ఉంది. అయితే ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు 6,843 కుటుంబాలకు మాత్రమే ఆ మేరకు పని కల్పించారు. టీడీపీ నేతలు, కొందరు సిబ్బంది ఇష్టారీతిన వ్యవహరిస్తూ ప్రజా ధనాన్ని దోచేస్తున్నారు.

కర్నూలు(అగ్రికల్చర్): పనుల కోసం దూరప్రాంతాలకు వెళ్లకుండా కూలీలు, చిరు రైతులకు ఉన్న ఊర్లోనే మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలు చేయాల్సి ఉంది. అయితే , రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చాక అడిగిన వారందరికీ పనులు కల్పించడం లేదు. కొందరు 'ఉపాధి' సిబ్బంది కాసుల కోసం జాబ్ కార్డులను సైతం తొలగిస్తున్నారు. స్థానికంగా పనులు లేకపోవడంతో చాలా మంది వలస బాట పడుతున్నారు. కర్నూలు జిల్లా పశ్చిమ ప్రాంతం నుంచే గాకుండా డోన్ నియోజకవర్గం నుంచి సైతం పెద్ద సంఖ్యలో కుటుంబాలు వలస వెళ్లి పోయాయి. సంక్రాంతి తర్వాత జిల్లా నుంచి మరో లక్ష కుటుంబాలు వలస వెళ్లడానికి సిద్ధంగా ఉన్నాయి. నంద్యాల జిల్లాతో పోలిస్తే కర్నూలు జిల్లాలో కరువు తీవ్రత ఎక్కువ. ఆలూరు, ఆదోని, ఎమ్మిగనూరు, పత్తికొండ, మంత్రాలయం నియోజకవర్గాల్లో పంటలు పండకపోవడంతో కరువు తిష్ట వేసింది. ఈ మండలాల్లో ఉపాధి పనులకు డిమాండ్ ఉంటుంది. కానీ వంద రోజుల పని దినాల కల్పన నామమాత్రానికే పరిమితమైంది. నందవరం మండలంలో 9 నెలల్లో కేవలం 12 కుటుంబాలకే వంద రోజుల పని దినాలు కల్పించారు. ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ ప్రకారం ప్రతి ఉమ్మడి జిల్లాలో ఏటా లక్ష కుటుంబాలకు వంద రోజుల పని కల్పించాలి. అయితే కర్నూలు జిల్లాలో 9 నెలల కాలంలో 3,130, నంద్యాల జిల్లాలో 3,713 కుటుంబాలకు మాత్రమే వంద రోజుల పని దినాలు కల్పించారు.

అంతా నిర్లక్ష్యం

ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఏడు లక్షల కుటుంబాలకు జాబ్ కార్డులు ఉన్నాయి. 2024–25లో 1.74 కోట్ల పని దినాలు కల్పించాలనేది లక్ష్యం కాగా.. అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. కర్నూలు జిల్లాలో 99 లక్షలు, నంద్యాల జిల్లాలో 75 లక్షల పని దినాలు కల్పించే విధంగా లక్ష్యాలు ఉన్నాయి. ఇప్పటి వరకు ఉమ్మడి జిల్లాలో 1.22 కోట్ల పని దినాలు మాత్రమే కల్పించినట్లు తెలుస్తోంది. కర్నూలు జిల్లాలో 9 నెలల్లో 64.71 లక్షలు, నంద్యాల జిల్లాలో 57.69 లక్షల పని దినాలు కల్పించినట్లు స్పష్టమవుతోంది. ప్రస్తుతం వ్యవసాయ పనులు లేక వ్యవసాయ కూలీలు, సన్న, చిన్న కారు రైతులు అల్లాడుతున్నప్పటికీ 'ఉపాధి' కల్పన అంతంత మాత్రమే. కర్నూలు జిల్లాలో 43,487, నంద్యాల జిల్లాలో 15,465 మందికి పనులు కల్పిస్తున్నట్లు తెలుస్తోంది.

బోగస్ మస్టర్లు

ఉమ్మడి జిల్లాలో ప్రస్తుతం 58,952 మంది కూలీలు పనులకు వస్తున్నట్లు మస్టర్ వేస్తున్నా... ఇందులో 25 నుంచి 30 శాతం బోగస్ ఉన్నట్లు తెలుస్తోంది. కింది స్థాయిలోని ఫీల్డ్ అసిస్టెంట్లు, సాంకేతిక సహాయకులు గ్రామస్థాయి టీడీపీ నేతలతో కుమ్మక్కై బోగస్ మస్టర్లు వేస్తున్నారు. రానున్న రోజుల్లో బోగస్ మస్టర్లు వేయడం ద్వారా అక్రమాలు మరింత భారీగా జరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. గ్రామ, మండల స్థాయి టీడీపీ నేతల ఆధ్వర్యంలోనే ఉపాధి పనులు జరుగుతున్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ఫీల్డ్ అసిస్టెంట్లను సమూలంగా మార్చి టీడీపీ కార్యకర్తలను నియమించుకున్నారు. టీడీపీ నేతలు చెప్పినట్లు ఫీల్డ్ అసిస్టెంట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

అక్రమాలు ఇవీ..

- పని దినాల్లో కూడా సగానికిపైగా కోత పెడుతున్నారు. సోమవారం నుంచి గురువారం వరకు వరుసగా ఆరు రోజులు పని చేస్తున్నప్పటికీ అనేక మంది ఒకటి, రెండు రోజులకు మాత్రమే వేతనాలు లభిస్తున్నాయి. టీడీపీ కార్యకర్తలకు మిగిలిన రోజుల వేతనాలు వేస్తున్నట్లు తెలుస్తోంది. శ్రమ ఒకరిది..., ఫలితం మరొకరిదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ అక్రమాలు మంత్రాలయం, ఆదోని, పత్తికొండ నియోజకవర్గాల్లో ఉన్నాయి.
- ఉమ్మడి కర్నూలు జిల్లాలోని పలు మండలాల్లో కంప్యూటర్ ఆపరేటర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు లోపాయికారీ ఒప్పందం చేసుకొని పథకం ప్రకారం జాబ్‌కార్డులు తొలగిస్తున్నారు. మళ్లీ జాబ్‌కార్డు కావాలంటే ఫీల్డ్ అసిస్టెంటుకు రూ.1500 నుంచి రూ.2000 వరకు ముడుపులు ఇచ్చుకోవాల్సి వస్తోంది.
- నిర్దిష్ట కొలతల ప్రకారం ఉపాధి పనులు చేస్తే రోజుకు రూ.300 ప్రకారం వేతనం లభించాల్సి ఉంది. ఉదయం 7 గంటలకు పని ప్రదేశానికి వెళ్లి, మధ్యాహ్నం 12 గంటల వరకు పని చేసినప్పటికీ లభిస్తున్న వేతనం రూ.100 వరకు మాత్రమే. దొంగ మస్టర్లకు మాత్రం రూ.280 నుంచి రూ.300 వరకు వేతనం లభిస్తోంది. 'ఉపాధి' పనుల్లో టీడీపీ నేతల జోక్యం పెరిగిపోవడంతో నిజమైన కూలీలకు తీరని అన్యాయం జరుగుతోంది.

దగా చేస్తున్నారు



మాకు ఉపాధి పనులే ఆధారం. నా భార్యతో కలసి సోమవారం నుంచి శనివారం వరకు వరుసగా ఆరు రోజులు పనిచేస్తే కేవలం ఒక్క రోజుకు, లేదా రెండు రోజులకే వేతనం లభిస్తోంది. డిసెంబరు నెల మొత్తం ఉపాధి పనులకు వెళ్లాం. ఒక్క వారం కూడా చేసిన పని దినాలకు అనుగుణంగా వేతనాలు లభించ లేదు. ఎందుకు ఈ విధంగా కూలీలను దగా చేస్తున్నారనే దానిపై ఎవ్వరూ నోరు విప్పడం లేదు. – అబ్బాసలి, కౌతాళం

ఆదుకోవడం లేదు



మాది అత్యంత వెనుకబడిన మండలం. ఇక్కడ ఉపాధి పనులకు డిమాండ్ ఎక్కువ. కుటుంబం యూనిట్‌గా మాకు జాబ్ కార్డు ఇచ్చారు. వంద రోజులు పని దినాలు పూర్తయ్యాయి. స్థానికంగా ఉపాధి పనులు లేకపోవడంతో తెలంగాణ ప్రాంతానికి కుటుంబంతో సహా వలస వెళ్లాం. క్రిస్మస్ పండుగ కోసం గ్రామానికి వచ్చాను. పనులు ఆదుకోవడం లేదు. మళ్లీ వలస పోవడానికి సిద్ధంగా ఉన్నాం. – టి. బాబు, పల్లెపాడు, కోసిగి మండలం

చర్యలు తీసుకుంటాం



వారంలో ఆరు రోజులు పని చేస్తే ఒకటి, రెండు రోజులకు మాత్రమే వేతనం లభిస్తుందనే ఫిర్యాదులు నా దృష్టికి రాలేదు. వారంలో ఎన్ని రోజులు పనికి హాజరైతే అన్ని రోజులకు వేతనం ఇవ్వాల్సి ఉంది. దీనిపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం. ఉపాధి పనులు పారదర్శకంగా జరుగుతున్నాయి. మస్టర్ వేయడంలో అక్రమాలకు అవకాశం లేకుండా నిఘా పెంచాం. – వెంకటరమణయ్య, డ్వామా పీడీ, కర్నూలు

9 నెలల్లో 100 రోజుల పనిదినాలు పొందిన కుటుంబాలు

మండలం	కుటుంబాలు
నందవరం	12
కృష్ణగిరి	25
గోనెగండ్ల	28
పెద్ద కడుబూరు	28
వెల్దుర్తి	28
ఎమ్మిగనూరు	36
పగిడ్యాల	43
కర్నూలు	66
డోన్	69
దొర్నిపాడు	72
మద్దికెర	78
కల్లూరు	86
కొలిమిగుండ్ల	87
కౌతాళం	88
హొళగుంద	93
కోడుమూరు	99
ఓర్వకల్లు	99

అసలు తగ్గేదేలే...

- ప్రతిభ చాటిన మహిళా కానిస్టేబుల్ అభ్యర్థులు
- రాత పరీక్షకు 145 మంది ఎంపిక



పరుగులో పోటీ పడుతున్న మహిళా అభ్యర్థులు



లాంగ్ జంప్ చేస్తున్న మహిళా అభ్యర్థి

కర్నూలు: పట్టుదల, ఆత్మవిశ్వాసం, లక్ష్య సాధనపై గురితో పురుషులకు దీటుగా అసలు తగ్గేదేలే అంటూ మహిళా కానిస్టేబుల్ అభ్యర్థులు పోటీ పడుతూ సత్తా చాటారు. పోలీసు శాఖలో కానిస్టేబుల్ ఉద్యోగాల ఎంపిక ప్రక్రియ కర్నూలులో చురుగ్గా సాగుతోంది. ప్రిలిమ్స్‌లో అర్హత సాధించిన ఉమ్మడి జిల్లా అభ్యర్థులకు స్థానిక ఏపీఎస్పీ రెండో పటాలం పరేడ్ మైదానంలో దేహదారుఢ్య పరీక్షలు కొనసాగుతున్నాయి. ఈ పరీక్షల్లో నెగ్గేందుకు అభ్యర్థులు మొక్కవోని దీక్షతో కృషి చేస్తున్నారు. నాలుగో రోజు శుక్రవారం 739 మందికి గాను 301 మంది మహిళా అభ్యర్థులు హాజరయ్యారు. 1600 మీటర్లు, 100 మీటర్ల విభాగాల్లో పరుగు, లాంగ్ జంప్ పరీక్షల సందర్భంగా మహిళా అభ్యర్థులు పోటీ పడిన తీరుకు అక్కడ విధుల్లో ఉన్న పోలీసు సిబ్బంది సైతం చప్పట్లు చరిచారు. బయోమెట్రిక్‌కు హాజరైన మహిళా అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్ తర్వాత పీఎంటీ, పీఈటీ పరీక్షలు నిర్వహించారు. ఇందులో 145 మంది అభ్యర్థులు ప్రతిభ కనబరచి తుది రాత పరీక్షకు అర్హత సాధించారు. ఏవైనా సమస్యలు, ఇతర కారణాలతో అప్పీలు చేసుకున్న అభ్యర్థులు జనవరి 28వ తేదీన మరోసారి దేహదారుఢ్య పరీక్షలకు హాజరుకావచ్చని అధికారులు ప్రకటించారు. అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ చల్లా కళ్యాణి, హోంగార్డ్స్ సదరన్ రీజియన్ కమాండెంట్ మేకల మహేష్ కుమార్, అడ్మిన్ అడిషనల్ ఎస్పీ జి.హుసేన్ పీరా, ఏఆర్ అడిషనల్ ఎస్పీ కృష్ణమోహన్, డీఎస్పీలు, సీఐలు, ఆర్‌ఐలు, ఎస్‌ఐలు, ఆర్‌ఎస్‌ఐలు, కార్యాలయ సిబ్బంది విధుల్లో పాల్గొన్నారు.

పంటలకు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ నిర్ధారణ



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

కర్నూలు (సెంట్రల్): 2025–26కు సంబంధించి వివిధ పంటలకు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్‌ను నిర్ధారించినట్లు కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో డిస్ట్రిక్ట్ కోఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకు ఆధ్వర్యంలో జిల్లాస్థాయి సాంకేతిక సమావేశాన్ని కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ, మత్స్య శాఖ, ఉద్యాన, పశుసంవర్ధక శాఖలకు సంబంధించి వివిధ రకాల రుణాల మంజూరు కోసం స్కేల్ ఆఫ్ ఫైనాన్స్‌ను నిర్ధారించినట్లు చెప్పారు. పెంచిన వివరాల ప్రతిపాదనలను రాష్ట్రస్థాయి సాంకేతిక కమిటీకి పంపించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కేడీసీసీ బ్యాంకు సీఈఓను ఆదేశించారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, కేడీసీసీ బ్యాంక్ సీఈఓ విజయ్ కుమార్, డీసీసీ బ్యాంక్ జనరల్ మేనేజర్ రామాంజనేయులు, ఎల్‌డీఎం రామచంద్రరావు, నాబార్డు డీడీఎం సుబ్బారెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వరలక్ష్మి, ఉద్యాన శాఖ అధికారి, బ్యాంకర్లు పాల్గొన్నారు.

విద్యార్థులతో కలసి 'ఫీజు' పోరు చేస్తాం

- ఈ నెల 29లోపు ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలి
- లేదంటే జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు నిర్వహిస్తాం
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి

కర్నూలు (టౌన్): రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 29వ తేదీ లోపు ఫీజురీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కర్నూలు జిల్లా అధ్యక్షులు ఎస్వీ మోహన్ రెడ్డి డిమాండ్ చేశారు. లేని పక్షంలో విద్యార్థినులు, విద్యార్థులతో కలిసి జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. స్థానిక ఎస్వీ కాంప్లెక్స్‌లోని సమావేశ హాలులో పార్టీ శ్రేణులతో కలసి శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్వీ మాట్లాడుతూ.. ఫీజు కోసం ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులకు నోటీసులు ఇస్తున్నా.. రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. రెండు రోజుల క్రితం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కేబినెట్ సమావేశం నిర్వహించి ఒక్క రూపాయి కూడా కేటాయించకుండా నీరు గార్చారని విమర్శించారు. రైతు భరోసా ఇస్తామని చెప్పిన చంద్రబాబు.. కేంద్ర ప్రభుత్వ పీఎం కిసాన్ పథకంతో లింకు పెట్టారన్నారు. ఇప్పటికే రెండు దఫాలు కేంద్రం నుంచి నిధులు విడుదలైనా.. రాష్ట్ర ప్రభుత్వం నయాపైసా ఇవ్వకుండా ఎగర కొట్టేందుకు కుట్ర చేస్తోందన్నారు. రాష్ట్రంలో 54 లక్షల మంది రైతుల కోసం బడ్జెట్‌లో రూ. 10 వేల కోట్లు ప్రకటించారని, అయితే ప్రభుత్వం రూ.వెయ్యి కోట్లు కూడా కేటాయించలేదన్నారు. కరువు భత్యం రూ.328 కోట్లు, పంటల బీమాకు రూ. 1,350 కోట్లు ఇవ్వలేదన్నారు.

సంక్షేమ క్యాలెండర్ విడుదల చేయాలి

సంక్షేమ పథకాలు ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే సంక్షేమ క్యాలెండర్‌ను విడుదల చేయాలని ఎస్వీ మోహన్‌రెడ్డి డిమాండ్ చేశారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి.. అమ్మ ఒడి కింద ఐదేళ్లలో రూ. 6 వేల కోట్లు ఖర్చు చేశారన్నారు. ప్రస్తుత ప్రభుత్వం తల్లికి వందనం పథకం అమలు చేయాలంటే రూ.20 వేల కోట్లు కేటాయించాల్సి ఉంటుందన్నారు. అయితే ఇప్పటి వరకు రూపాయి ఇచ్చింది లేదన్నారు. 18 సంవత్సరాలు నిండిన అమ్మాయిలకు రూ.1,500, నిరుద్యోగులకు రూ. 3 వేలు ఇస్తామని చెప్పారని, ఏం చేశారని ప్రశ్నించారు? సీబీఎస్‌ఈని ఎత్తేయడం, ఇంగ్లిషు మీడియం చదువులు అటకెక్కించడం, డిజిటల్ క్లాసులు, ట్యాబ్‌లు ఇవ్వకుండా విద్యావ్యవస్థను చంద్రబాబు భ్రష్టు పట్టించారన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉద్యోగులకు 27 శాతం ఐఆర్ ఇచ్చారని గుర్తు చేశారు. ప్రస్తుత ప్రభుత్వం ఐఆర్, పీఆర్సీ, కనీసం డీఏలు ఇవ్వలేదని విమర్శించారు. ఒక్క హామీని అమలు చేయకుండానే ప్రభుత్వం రూ.75 వేల కోట్లు అప్పు చేసిందని, కరెంటు చార్జీలతో రూ. 15 వేల కోట్లు, రిజిస్ట్రేషన్ చార్జీలను 20 శాతం పెంచి కోట్ల రూపాయిలు ప్రజలపై భారాలు వేశారన్నారు. సంక్షేమ పథకాల అమలు కోసం సంక్రాంతి తరువాత ప్రత్యక్ష పోరు సాగిస్తామన్నారు.

నవరత్నాలు గుర్తుకు వస్తున్నాయి: పత్తికొండ మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

గత ప్రభుత్వంలో అమలు చేసిన నవరత్న పథకాలను ప్రజలు గుర్తు చేసుకుంటున్నారని పత్తికొండ మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. చంద్రబాబు సూపర్ సిక్స్ హామీలతో సంక్షేమ పథకాలు అందుతాయని ఆశ పడ్డ ప్రజలకు నిరాశ ఎదురైందన్నారు. అసెంబ్లీ నియోజకవర్గాల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు అసలు కనిపించడం లేదన్నారు. ఎన్నికల కోడ్ సమయంలో గత ప్రభుత్వం చేసిన పనులను ప్రస్తుత ప్రభుత్వంలో ప్రజా ప్రతినిధులు ప్రారంభిస్తున్నారన్నారు. ఆరు నెలల్లోనే ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత ప్రారంభమైందన్నారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మద్దూరు సుభాష్ చంద్రబోస్, జిల్లా మాజీ అధ్యక్షురాలు సిట్రా సత్యనారాయణమ్మ మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారన్నారు. రైతులు, ఉద్యోగులు, నిరుద్యోగులు, మహిళలందరూ కూటమి ప్రభుత్వంపై దుమ్మెత్తి పోస్తున్నారన్నారు. ప్రజల పక్షాన సంక్షేమ పథకాలు అమలు చేసేంత వరకు పోరాటం చేస్తామన్నారు. కాలయాపన చేయకుండా ఇప్పటికైన ప్రభుత్వం ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పార్టీ కార్యదర్శులు, అనుబంధ విభాగాల అధ్యక్షులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మృత్యువు కబళించింది

- రోడ్డు ప్రమాదంలో దంపతుల దుర్మరణం
- చెన్నంపల్లిలో విషాదఛాయలు



మృతులు పలుకూరు రాజు, సుమలత (ఫైల్)



మృతదేహాల వద్ద రోదిస్తున్న కుటుంబసభ్యులు

తుగ్గలి/పెద్దవడుగూరు: అనంతపురం జిల్లా పెద్దవడుగూరు మండలం క్రిష్టిపాడు వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తుగ్గలి మండలం చెన్నంపల్లికి చెందిన దంపతులు మృతి చెందారు. గ్రామానికి చెందిన వలుకూరు రాజు(35), సుమలత (30) దంపతులు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరికి కూతురు, కుమారుడు ఉన్నారు. ఊర్లో ఈనెల 22న జరిగే దేవర ఉత్సవాలు ఉన్నందున నేత చీరల తెచ్చుకునేందుకు ద్విచక్ర వాహనంపై అనంతపురం జిల్లా యాడికి వెళ్లారు. అక్కడ పట్టుచీరలు కొనుగోలు చేసిన అనంతరం తిరిగి మోటారు సైకిల్‌పై వస్తుండగా పెద్దవడుగూరు మండలం క్రిష్టిపాడు సమీపంలో 67వ జాతీయ రహదారిపై పెట్రోల్ బంక్ వద్ద గుత్తి వైపు నుంచి యాడికికి శరవేగంగా వెళుతున్న బొలెరో వాహనం ఢీకొంది. ఘటనలో దంపతులిద్దరూ మృతిచెందారు. బొలెరో వాహనంలో ఉన్న యాడికి గ్రామానికి చెందిన యువకుడు సాయి మణికంఠకూ తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న యాడికి ఎస్‌ఐ ఆంజనేయులు, సిబ్బంది అక్కడికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. సమాచారం అందుకున్న మృతుల కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి చేరుకుని బోరున విలపించారు. మృతుడి తండ్రి శంకరయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. దంపతుల మృతితో చెన్నంపల్లి గ్రామంలో తీవ్ర విషాదఛాయలు నెలకొన్నాయి.

మధ్యాహ్న గుడి భోజనం



గుడి భోజనం కోసం బారులు తీరిన విద్యార్థులు

మంత్రాలయం: ఈ చిత్రం చూస్తుంటే బడిలో విద్యార్థులు మధ్యాహ్న భోజనానికి బారులుదీరారని అనుకుంటున్నారా.. కాదండోయ్.. గుడి భోజనం కోసం మధ్యాహ్నం పూట బారులుదీరిన చిత్రమిది. కోసిగి బాలుర ఉన్నత పాఠశాలలో దాదాపు 1,200 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. అందులో శుక్రవారం 350 మంది పాఠశాలలో భోజనం చేసినట్లు ప్రధానోపాధ్యాయుడు ఖలీల్ అహ్మద్ సెలవిచ్చారు. సాధారణంగా ఉన్నత పాఠశాలలో మధ్యాహ్నం 12 గంటల నుంచి 1గంట వరకు మధ్యాహ్న భోజనాలు జరుగుతాయి. ఇక్కడ మాత్రం మెనూ ప్రకారం శుక్రవారం 350 మందికి చిత్రన్నం, టమాట కర్రీ వడ్డించినట్లు రికార్డుల్లో నమోదు చేశారు. 350 మంది విద్యార్థులు భోజనాలు ముగించుకోవడానికి కనీసం గంట సమయం పడుతుంది. ఆపై భోజన పాత్రలు శుభ్రం చేసుకోవడానికి వంట మనుషులకు ఎంత లేదన్నా గంట సమయం పడుతుంది. అయితే ఇక్కడ అలాంటిది ఏమీ కనిపించ లేదు. హెచ్‌ఎం చెప్పిన ప్రకారం ఒంటి గంటలోపే ఇక్కడ భోజనాలు ముగిసినట్లు చెబుతున్నారు. బడి వెనుక భాగంలో సుంకులమ్మ దేవి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం చేపట్టారు. ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు భోజనాలకు ఆహ్వానించినట్లు, అందుకు లెటర్ పెట్టినట్లు హెచ్‌ఎం చెప్పుకొచ్చారు. మరి గ్రామస్తులు, విద్యార్థులు భోజనాలకు రావాలని లెటర్ ఇచ్చి ఉంటే పాఠశాలలో భోజనం ఎందుకు చేసినట్టో అర్థంకాని ప్రశ్న. తమ తప్పును కప్పిపుచ్చుకునేందుకు లేదన్నట్టుగా తూతూ మంత్రంగా మధ్యాహ్న భోజనం సాగించినట్లు తెలుస్తోంది.

క్లుప్తంగా

నేడు జిల్లాకు సీఎస్ రాక

కర్నూలు న్యూసిటీ: రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ శనివారం కర్నూలు నగరానికి రానున్నారు. ఇప్పటికే హైదరాబాద్ చేరుకున్న ఆయన ఉదయం రోడ్డు మార్గంలో బయలు దేరి 11 గంటలకు కర్నూలు చేరుకుంటారు. దిన్నెదేవరపాడు గ్రామ సమీపంలోని విద్యుత్ నియంత్రణ భవనంలో నిర్వహించే సమీక్షలో పాల్గొననున్నారు. అనంతరం ఆయన రోడ్డు మార్గంలో హైదరాబాద్ చేరుకుని అక్కడి నుంచి వెలగపూడికి తిరిగివెళ్లనున్నారు.

జర్మనీలో నర్సింగ్ ఉద్యోగ అవకాశాలు

కర్నూలు (హాస్పిటల్): జీఎన్ఎం, బీఎస్సీ నర్సింగ్ కోర్సులు చదివిన వారికి జర్మనీలో ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డి.మనోహర్ తెలిపారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో అంతర్జాతీయ నైపుణ్య శిక్షణ, ఉపాధి కల్పన అవకాశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన డి.మనోహర్ మాట్లాడు తూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఓం క్యాప్, టూకామ్ కన్సల్టెన్సీ ప్రైవేట్ లిమిటెడ్ వారి ఆధ్వర్యంలో జర్మనీ భాష ఏ1, ఏ2, బీ1, బీ2 స్థాయిలపై శిక్షణ ఇచ్చి జర్మనీలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ మంజుల రాణి, జిల్లా ఉపాధి కల్పన అధికారిణి పి.దీప్తి, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఆనంద్‌రాజ్ కుమార్, టూకామ్ కన్సల్టింగ్, ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ వైస్ ప్రెసిడెంట్ అగస్టీన్ పాల్గొన్నారు.

ఏపీ ఎన్జీవో అసోసియేషన్ జనరల్ సెక్రటరీగా కృష్ణుడు

కర్నూలు(అగ్రికల్చర్): ఏపీ ఎన్జీవో అసోసియేషన్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ జనరల్ సెక్రటరీగా కేసీహెచ్ కృష్ణుడు నియమితులయ్యారు. కొన్నేళ్లుగా ఈ పోస్టులో జవహర్‌లాల్ కొనసాగుతున్నారు. ఈయన పశుసంవర్ధక శాఖలో సూపరింటెండెంటుగా పని చేస్తుండగా రెండేళ్ల క్రితం గజిటెడ్ మేనేజర్‌గా పదోన్నతి లభించింది. అయితే పని ఒత్తిడితో అసోసియేషన్ కార్యక్రమాలకు రాలేకపోతున్నారు. దీంతో శ్రీశైలం ప్రాజెక్ట్ ఇంజినీర్ విభాగంలో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న కేసీహెచ్ కృష్ణుడిని ఇన్‌చార్జ్ జనరల్ సెక్రటరీగా నియమిస్తూ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వీసీహెచ్ వెంగళ్‌రెడ్డి నిర్ణయం తీసుకున్నారు.

మూడు దుకాణాల్లో చోరీ

ఆదోని అర్బన్: స్థానిక రైతు బజారులోని మూడు కిరాణా షాపుల్లో చోరీ జరిగింది. షాపుల పైకప్పుకు కన్నం వేసి లోపలికి ప్రవేశించి అందినకాడికి దోచుకెళ్లారు. యజమాని సికిందర్ దుకాణంలో రూ.3 వేలు నగదు, రూ.10 వేలు విలువ జేసే సరుకులు, వీరేష్ దుకాణంలో రూ.1,500, లక్ష్మన్న దుకాణంలో రూ.2 వేలు నగదును అపహరించారు. సీఐ సూర్యమోహన్‌రావు దుకాణాలను పరిశీలించి కేసు నమోదు చేసుకున్నారు.

డేంజర్ గేమ్..



- ఆన్‌లైన్ గేమ్‌లకు బానిసలవుతున్న యువత
- రూ.లక్షలు పోగొట్టుకొని అప్పుల పాలు
- ఆత్మహత్యలు చేసుకుంటున్న వైనం

కొలిమిగుండ్ల: సప్త వ్యసనాల్లో ఒకటి చతుర్ముఖ పారాయణం.. అదే పేకాట. ఒకప్పుడు సరదా కోసం మొదలైన పేకాట కాలక్రమేణా వ్యసనంగా మారిపోయింది. ఈ ఆట మత్తులో పడి జేబులో డబ్బు, బ్యాంక్ ఖాతాలో నగదు పోగొట్టుకుంటున్నారు. ఆన్‌లైన్ గేమింగ్ కల్చర్ శరవేగంగా పట్టణాల నుంచి పల్లెలకు విస్తరించింది. విద్యార్థులు, ఉద్యోగులు మొదలుకొని మహిళలు సైతం ఆన్‌లైన్ గేమ్‌లు ఆడుతున్నారు. ప్రతి ఒక్కరి చేతిలో స్మార్ట్ ఫోన్ ఉండటంతో ఏమాత్రం ఖాళీ దొరికినా ఇంటర్నెట్ ఓపెన్ చేసుకొని గంటల తరబడి వాటికే సమయం కేటాయిస్తున్నారు. సులువుగా డబ్బు సంపాదించాలన్న అత్యాశతో యువకులు ఆన్‌లైన్ పేకాట రమ్మీ ఆడుతూ రూ.లక్షలు పోగొట్టుకుంటున్నారు. అప్పుల పాలై వాటిని తీర్చేదారిలేక చివరికి ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు.

మాయా జూదం..ఆన్‌లైన్ రమ్మీ

మొబైల్, ల్యాప్‌ట్యాప్‌ల్లో చిన్ని తెరలపై ఆడే 13 ముక్కల పేకాట వ్యసనం ఎంతో మంది బతుకులను పట్టి పీడిస్తోంది. ఆన్‌లైన్ గేమ్‌ల్లో రమ్మీదే ప్రథమస్థానం. ప్రత్యేకంగా రూపొందించిన యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని లాగిన్ అయి అకౌంట్ క్రియేట్ చేసుకుంటున్నారు. గేమ్‌ను ఆడేలా ప్రోత్సహించేందుకు కొంత మొత్తాన్ని ఫ్రీగా ఇస్తారు. ఆ డబ్బుతో ఆడటం మొదలు పెట్టిన కస్టమర్లకు కంపెనీ ఇచ్చిన డబ్బు పోగా తన సొంత డబ్బు రూ.వేలకు రూ.వేలు పెట్టి ఆడేలా బానిసలు చేస్తారు. ఇప్పటికే ఎంతో మంది ఆన్‌లైన్ రమ్మీ మోజులో పడి జేబులు గుల్లజేసుకున్నారు. అటువైపు ఆడుతోంది ఎవరో తెలియని ఈ మాయా జూదంలో ఇటువైపు ఆటగాళ్ల బ్యాంక్ ఖాతాలు ఖాళీ అవుతున్నాయి. మొదట్లో కొన్ని ఆటలు గెలిచినట్లు ఉంటుంది. ఆ తర్వాత ఓటమి ఉంటుంది. అవతల వ్యక్తి అంత గెలిచారు.. ఇంత గెలిచారని స్క్రీన్‌పై కనిపిస్తుంటుంది. దీంతో చాలా మంది అత్యాశకు పోయి రమ్మీ మాయలో డబ్బు కోల్పోవడంతో పాటు అప్పుల పాలవుతున్నారు.

స్నేహితునికి ప్రమాదం జరిగిందని..

కొలిమిగుండ్ల మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువకుడు సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. ఇంటి వద్ద నుంచే వర్క్ ఫ్రం హోం చేస్తున్నాడు. ల్యాప్‌ట్యాబ్‌లో నుంచి ఆన్‌లైన్‌లో రమ్మీ ఆడటం మొదలు పెట్టాడు. ప్రతి నెలా వచ్చే జీతంతో పాటు స్నేహితులతో అప్పు చేశాడు. కొద్ది రోజుల తర్వాత అప్పు చెల్లించాలని ఒత్తిళ్లు రావడంతో చేసేది లేక కొత్త డ్రామాకు తెరలేపాడు. తన స్నేహితుడికి రోడ్డు ప్రమాదం జరిగి చాలా సీరియస్‌గా ఉందని తల్లికి చెప్పి డబ్బు అర్జెంట్‌గా కావాలని చెప్పడంతో ఊర్లో వాళ్లతో పోగు చేసి సుమారు రూ.4 లక్షల మేర తీసుకొచ్చి ఇచ్చింది. వాటిని కూడా గేమ్ ఆడి పోగొట్టుకున్నాడు. వారం పది రోజుల తర్వాత స్నేహితుడు కోలుకోలేక చనిపోయాడని తల్లికి అబద్ధం చెప్పాడు. ఎట్టకేలకు ఆలస్యంగా నిజం బయట పడింది.

ఈజీ మనీ కోసం

క్షణాల్లో లక్షాదికారులై పోవాలనే దురాలోచన చాలా మంది జీవితాలను ఛిన్నాభిన్నం చేస్తోంది. ఈజీ మనీ కోసం ఆన్‌లైన్ రమ్మీకి అలవాటు పడుతున్నారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, ప్రభుత్వ ఉద్యోగులు, వ్యాపారులు, యువత ఈ మాయా జూదం ఉచ్చులో పడి గిలగిల్లాడుతున్నారు. చేతిలో ఉన్నది పోగొట్టుకోవడంతో పాటు ఇతరుల వద్ద అప్పు చేయడం, బంగారు ఆభరణాలు తాకట్టు పెట్టడం, బైక్‌లు, ఖరీదైన సెల్‌ఫోన్‌లు సైతం అమ్మేసి జూదంలో పెడుతున్నారు. ఆన్‌లైన్ జూదాన్ని అదుపులోకి ఎలా తీసుకురావాలన్నది ఎవరికీ అంతుచిక్కడం లేదు. జూదం మాయలో పడి కుటుంబ సభ్యులను మోసగించి తీసుకున్న డబ్బులను వాటికి ఖర్చు చేస్తున్నారు. ఆన్‌లైన్ గేమ్‌లపై అవగాహన లేక పోవడంతో వయసుతో సంబంధం లేకుండా వాటి మోజులో పడిపోతున్నారు.

ఆన్‌లైన్ మోజులో ఉపాధ్యాయుడు

తాడిపత్రికి చెందిన ఓ ఉపాధ్యాయుడు కొలిమిగుండ్ల మండలంలోని పలు ఉన్నత పాఠశాలల్లో పని చేస్తుండేవాడు. గణితంలో మంచి ప్రతిభ కలిగి బాగా బోధించేవాడు. ఆన్‌లైన్ గేమ్‌లకు అలవాటు పడి పెద్ద మొత్తంలో అప్పు చేశాడు. వాటిని తీర్చలేక ఉద్యోగానికి సెలవు పెట్టకుండా వెళ్లిపోవడంతో ఉన్నతాధికారులు అతనిపై చర్యలు తీసుకున్నారు.

అప్పు తీర్చే మార్గం లేక

కొలిమిగుండ్ల మండల కేంద్రానికి చెందిన ఓ వ్యక్తి ఆర్థికంగా బాగా ఉండేవాడు. సులభంగా డబ్బు సంపాదించాలనే ఆశతో ఆన్‌లైన్ రమ్మీకి బానిసగా మారిపోయాడు. చేతిలో ఉన్న లక్షలాది రూపాయల డబ్బు, విలువైన ఆస్తిని పోగొట్టుకున్నాడు. ఒక్క రోజులోనే రూ.16 లక్షలు పోగొట్టుకున్నాడు. అప్పుల వాళ్ల నుంచి ఒత్తిళ్లు కావడంతో అప్పు తీర్చే దారి లేక చివరకు ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

ఆన్‌లైన్ గేమ్‌లకు దూరంగా ఉండాలి



ఆన్‌లైన్ గేమ్‌ల బారిన పడి చాలా మంది జీవితాలు నాశనం చేసుకుంటున్నారు. వాటికి దూరంగా ఉండాలి. పిల్లల నడవడికపై తల్లితండ్రులు నిఘాఉంచాలి. సరదాగా జూదం అంటు తర్వాత వ్యసనంగా మార్చుకుంటున్నారు. సెల్‌ఫోన్‌లను తెలియని సమాచారం కోసం ఉపయోగించుకోవాలి. యువత మంచి భవిష్యత్‌ను అంధకారంలో నెట్టుకుంటున్నారు.

– రమేష్‌బాబు, సీఐ, కొలిమిగుండ్ల

ఐసీఎంఆర్‌కు కేఎంసీ నుంచి ఐదు ప్రాజెక్టులు



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టి నరసమ్మ

కర్నూలు (హాస్పిటల్): ఢిల్లీలోని భారతీయ వైద్య పరిశోధన సంస్థ (ఐసీఎంఆర్)కు కర్నూలు మెడికల్ కళాశాలలోని ఫార్మకాలజీ విభాగం నుంచి ఐదు ప్రాజెక్టులు ఎంపికయ్యాయి. వైద్య వ్యవస్థలో ఆధునాతన మార్పులు, అభివృద్ధి కోసం ఢిల్లీలోని ఐసీఎంఆర్ దేశ వ్యాప్తంగా ఉన్న మెడికల్ కాలేజీల్లోని వైద్యవిద్యార్థుల నుంచి పరిశోధన ప్రతిపాదనలు స్వీకరించగా కర్నూలు మెడికల్ కళాశాలలోని ఫార్మకాలజీ విభాగానికి చెందిన ఐదుగురు విద్యార్థుల పరిశోధన ప్రతిపాదనలకు అనుమతి లభించింది. శుక్రవారం ప్రతిపాదనలు పంపిన విద్యార్థులు సాహితీ, సుమేధ, శివసోకిత్, మహమ్మద్ అకిత్, పీజీ డాక్టర్ జ్యోత్స్న, ఫార్మకాలజీ హెచ్‌ఓడీ డాక్టర్ రాజేష్‌ను కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టి నరసమ్మ అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏటా వైద్య విభాగంలో పరిశోధన నిమిత్తం పరిశోధన ప్రతిపాదనలను ఐసీఎంఆర్ ప్రతిష్టాత్మకంగా ఎంపిక చేస్తోందన్నారు. డాక్టర్ రాజేష్ మాట్లాడుతూ తమ విభాగానికి చెందిన వైద్య విద్యార్థుల ఐదు పరిశోధన ప్రాజెక్టులకు అనుమతి లభించడం సంతోషంగా ఉందన్నారు.

రైలు కింద పడి ..



నంద్యాల రైల్వేస్టేషన్‌లో సీసీ కెమెరాల్లో గుర్తించిన వ్యక్తి

మహానంది: నంద్యాల నుంచి గిద్దలూరు వెళ్లే రైల్వే మార్గంలో గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే హెడ్ కానిస్టేబుల్ ఖలీల్ అహమ్మద్ తెలిపిన వివరాల మేరకు.. డోన్ నుంచి గుంటూరు వరకు వెళ్లే 17227 రైలులో ఓ వ్యక్తి నంద్యాల నుంచి దిగువమెట్ట వరకు ప్రయాణం చేశారు. అయితే, ఆయన చలమ నుంచి దిగువ మెట్ట మధ్యలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో వివరాలు తెలియరాలేదు. మృతుడిని ఎవరైనా గుర్తిస్తే రైల్వే పోలీసులకు సమాచారం అందించాలని హెడ్‌కానిస్టేబుల్ విజ్ఞప్తి చేశారు.

గడ్డివాముల దగ్ధం

- రూ. 10 లక్షల ఆస్తి నష్టం



హెబ్బటంలో దగ్ధమవుతున్న గడ్డివాములు

హొళగుంద: హెబ్బటం గ్రామంలో శుక్రవారం మధ్యాహ్నం తొమ్మిది గడ్డివాములు కాలి బూడిదయ్యాయి. దాదాపు రూ. 10 లక్షల ఆస్తి నష్టం సంభవించింది. కురుకుంద రోడ్డులో రైతులు కూర్మయ్యగారి శేకన్న, సూగూరు పెద్ద నాగయ్య, మాల కిష్టప్ప, దాసరి తిక్కయ్యకు చెందిన చెరో రెండు గడ్డివాములతో పాటు ఉసేన్‌పీరాకు చెందిన ఒక గడ్డివామి ఈ ప్రమాదంలో కాలి బూడిదయ్యాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. ఇటీవల గ్రామంలో కొందరు రైతులు పశువుల మేత కోసం ట్రాక్టర్ రూ. 25 వేల ప్రకారం కర్ణాటకలో గ్రాసం కొనుగోలు చేశారు. ఇంతలోనే అగ్నికి గడ్డి వాములు ఆహూతి అయ్యాయి. ప్రమాదవశాత్తూ జరిగిందా.. ఎవరైనా నిప్పు పెట్టారనేది తెలియాల్సి ఉంది.

క్రీడా కోటాను సద్వినియోగం చేసుకోండి



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు

కర్నూలు (టౌన్): విద్యార్థులు క్రీడల్లో రాణిస్తూ క్రీడా కోటాను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు అన్నారు. శుక్రవారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో హాకీ జట్టు ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన క్రీడాకారులను పరిచయం చేసుకుని.. జిల్లా హాకీ క్రీడాకారులు మంచి పేరు సాధించారన్నారు. అదే స్ఫూర్తితో పూర్వ వైభవాన్ని తీసుకురావాలన్నారు. హాకీ సంఘం కార్యదర్శి జిల్లా కార్యదర్శి దాసరి సుధీర్ మాట్లాడుతూ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు ఈనెల 17 నుంచి 19 వరకు అన్నమయ్య జిల్లా మదనపల్లెలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు.

63 ఉత్పత్తుల్లో నాణ్యత లేదని నిర్ధారణ

కర్నూలు(అగ్రికల్చర్): ఎరువులు, విత్తనాలు, పురుగు మందులకు సంబంధించి 63 ఉత్పత్తుల్లో నాణ్యత లోపం ఉన్నట్లు నిర్ధారణ అయ్యింది. 2024–25 సంవత్సరానికి సంబంధించి ఫర్టిలైజర్ (ఎస్‌పీకే)లో వ్యవసాయ అధికారులు 718 శ్యాంపుల్స్ తీసి ల్యాబ్‌లకు పంపారు. ఎస్‌పీకేల్లో నాణ్యాతా ప్రమాణాలకు సంబంధించి 7 అంశాలపై (పారామీటర్లు) పరీక్షలు నిర్వహిస్తారు. వీటిల్లో 17 శాంపుల్స్‌ల్లో నాణ్యత లోపం నిర్ధారణ అయింది. విత్తనాలకు 1,357 శ్యాంపుల్స్ తీసి ల్యాబ్‌లకు పంపగా ఇందులో 45 శ్యాంపుల్స్‌ల్లో నాణ్యత లేనట్లు తేలింది. అత్యధికంగా పత్తిలో నాణ్యత లోపం బయటపడింది. పత్తిలో 41 శ్యాంపుల్స్, సజ్జలో 3, మొక్కజొన్నలో ఒక్కటి ప్రకారం నాణ్యత లేదని పరీక్షల్లో స్పష్టమైంది.

ప్రమాదవశాత్తూ 51 గొర్రెలు మృతి



మృతి చెందిన గొర్రెలు

కోడుమూరు రూరల్: వంక దాటుతున్న క్రమంలో గొర్రెలు ఒకదానిపై ఒకటి పడటంతో ఊపిరాడక 51 జీవాలు మృత్యువాత పడ్డాయి. లద్దగిరి, కొండాపురం గ్రామాలకు చెందిన పలువురి గొర్రెలు శుక్రవారం మేతకు వెళ్లాయి. కాగా లద్దగిరి సమీపంలో ఒట్టి కుంట వంక దాటుతున్న సమయంలో గొర్రెలు బెదిరి ఒకదానిపై ఒకటి పడటంతో ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో బోయ అయ్యస్వామికి సంబంధించి 9, కురువ మధు 16, గిడ్డమూర్తి 6, మద్దిలేటి 2, ఓంప్రకాష్ 6, కురువ రాముడు 1, ఓబులేసు 1, ఎర్రదొడ్డి భాస్కర్ 3, గొల్ల గోపాల్ 3, బోయ గోపాల్‌కు చెందిన 4 గొర్రెలు మృతి చెందాయి. విషయం తెలుసుకున్న లద్దగిరి పశువైద్యాధికారి అమృత్‌రెడ్డి, సిబ్బంది భరత్ సంఘటన స్థలానికి చేరుకుని చనిపోయిన గొర్రెలకు పంచనామా నిర్వహించారు. దాదాపు రూ.8 లక్షల నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని గొర్రెల కాపరులు కోరుతున్నారు.

ఎస్సార్‌బీసీలో పడి వృద్ధుడు గల్లంతు

బనగానపల్లె రూరల్ : పట్టణంలోని యాగంటిపల్లె రహదారిలో ఉన్న ఎస్ఆర్‌బీసీ ప్రధాన కాల్వలో గాలి ఓబయ్య అనే వృద్ధుడు గల్లంతయ్యాడు.ఈ సంఘటన శుక్రవారం జరిగింది. స్థానికుల సమాచారం మేరకు.. గాలి ఓబయ్య, లక్ష్మీదేవి దంపతులు ఎస్ఆర్‌బీసీ పక్కన ఉన్న పొలంలో బర్రెలు పెట్టుకొని జీవిస్తున్నారు. తెల్లవారుజామున బహిర్భూమికి వెళ్లిన ఓబయ్య ప్రమాదశాత్తూ కాల్వలో జారిపడిపోయాడు. సాయంత్రం వరకు కాల్వ వెంట గాలించినా ఆచూకీ లభించలేదు. శనివారం ఉదయం మళ్లీ గాలింపు చర్యలు చేపట్టనున్నట్లు ఎస్ఐ దుగ్గిరెడ్డి తెలిపారు.

బీచ్‌లో గల్లంతైన ఇంజినీరింగ్ విద్యార్థి మృతి

బనగానపల్లె రూరల్ : చెన్నైలోని మేరీనా బీచ్‌లో జనవరి 1 వ తేదీ గల్లంతైన మండలంలోని నందివర్గం గ్రామానికి చెందిన ఇంజినీరింగ్ విద్యార్థి ఎస్.సాయిసంతోష్‌రెడ్డి(18) శవమై తేలాడు. బాధిత కుటుంబంలో విషాదం నింపిన ఈ ఘటన వివరాలు స్థానికులు తెలిపిన మేరకు... గ్రామానికి చెందిన వెంగల్‌రెడ్డి, కోటేశ్వరమ్మ దంపతుల కుమారుడు సాయి సంతోష్‌రెడ్డి తమిళనాడులోని సవిత యూనివర్సిటీలో బీఈ మొదటి సంవత్సరం అభ్యసిస్తున్నారు. జనవరి 1న స్నేహితులతో కలిసి బీచ్‌కు వెళ్లాడు. ప్రమాదశాత్తూ అందులో గల్లంతయ్యాడు. గాలింపు చర్యలు చేపట్టిన అధికారులు విద్యార్థి మృత దేహాన్ని వెలికి తీసి శుక్రవారం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

చీరకొంగు యమపాశమై!



మృతిచెందిన అనంతమ్మ (ఫైల్)

తుగ్గలి: చీర కొంగు ఆ మహిళ పాలిట యమ పాశమైంది. గొంతుకు చీర బిగుసుకుని ఓ మహిళా రైతు మృతి చెందిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. రామలింగాయపల్లికి చెందిన కోటగంటి మాధవయ్య కౌలుకు భూమి తీసుకుని ఖరీఫ్‌లో కంది పంట సాగు చేశారు. పంట కోసి శుక్రవారం పొలంలో నూర్పిడి చేస్తున్నారు. ఈ సమయంలో మాధవయ్య భార్య అనంతమ్మ (46) నూర్పిడి యంత్రంలోకి కంది కట్టె వేస్తుండగా యంత్రం చక్రంలో చీర కొంగు చిక్కుకుంది. యంత్రాన్ని ఆఫ్ చేసేలోపు ఘోరం జరిగిపోయింది. ఆమె గొంతుకు చీర బిగుసుకుపోయి ఊపిరాడక అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలికి భర్త, ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. మహిళా రైతు మృతితో గ్రామంలో విషాదం అలుముకుంది.

మసీదుపురంలో ఘర్షణపై పరస్పర ఫిర్యాదులు

- వైఎస్సార్‌సీపీ వర్గీయులపై మాత్రమే కేసులు నమోదు

మహానంది: మహానంది మండలం మసీదుపురం గ్రామంలో నూతన సంవత్సరం సందర్భంగా ఏర్పాటు చేసుకున్న బ్యానర్లు, ఫ్లెక్సీల విషయంలో జరిగిన ఘర్షణలో పోలీసులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారు. వైఎస్సార్‌సీపీకి సంబంధించిన వారిపై మాత్రమే కేసులు నమోదు చేశారు. న్యూఇయర్ బ్యానర్లు, ఫ్లెక్సీల ఏర్పాటు విషయంలో గురువారం రాత్రి గొడవ జరిగింది. వైఎస్సార్‌సీపీకి చెందిన పలువురు గాయపడ్డారు. అయితే, ఈ ఘటనపై గ్రామానికి చెందిన ఎన్. పెద్దనరసింహుడు శుక్రవారం ఉదయం పోలీసులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయగా ఇంకా కేసు నమోదు చేయలేదు. ప్రత్యర్థి వర్గానికి చెందిన ఆనందరావు ఫిర్యాదు చేయగానే సుమారు పది మందిపై కేసు నమోదు చేశారు. అంతేకాదు ఘర్షణ జరిగే సమయంలో ఓ యువకుడు వీడియో తీశాడన్న నెపంతో అతడిని పోలీసులు స్టేషన్‌కు పిలిపించి తమదైన శైలిలో ట్రీట్‌మెంట్ ఇచ్చినట్లు బాధిత కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఈ విషయాలపై ఎస్ఐ రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ ఇరువర్గాల వారు ఫిర్యాదు ఇచ్చారని, విచారణలో భాగంగా పలు విషయాలు వెల్లడి కావాల్సి ఉందన్నారు. ఎవరికీ ఎలాంటి ట్రీట్‌మెంట్ ఇవ్వలేదని, రెచ్చగొట్టే ధోరణి సరికాదని చెప్పామన్నారు.

ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలి







ప్రజాభిసేకరణ చేస్తున్న జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్, మాట్లాడుతున్న జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, సభకు హాజరైన వివిధ గ్రామాల రైతులు

- రామ్‌కో పరిశ్రమ చుట్టుపక్కల ఉన్న మిగులు భూములు కొనుగోలు చేయాలి
- సీబీఎస్ఈ పాఠశాల ఏర్పాటు చేయాలి
- ప్రజాభిప్రాయ సేకరణలో రైతులు
- పర్యావరణానికి హాని కలగకుండా చూడాలన్న జెడ్పీ చైర్మన్

కొలిమిగుండ్ల: 'పరిశ్రమలు వస్తే ఈప్రాంతం అభివృద్ధితో పాటు పిల్లల భవిష్యత్ బాగుంటుందనే ఉద్దేశంతో వేలాది ఎకరాల భూములు ఇచ్చాం. దీనిని దృష్టిలో ఉంచుకొని పరిశ్రమల నిర్వాహకులు మా పిల్లలకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాల'ని వివిధ గ్రామాలకు చెందిన రైతులు డిమాండ్ చేశారు. కల్వటాల సమీపంలోని రామ్‌కో సిమెంట్ ఫ్యాక్టరీ ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచేందుకు శుక్రవారం ఆ పరిశ్రమ ఆవరణలో కాలుష్య నియంత్రణ మండలి అధికారి కిషోర్ ఆధ్వర్యంలో జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్ అధ్యక్షతన ప్రజాభిప్రాయ సేకరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు తమ సమస్యలు వెలిబుచ్చారు. పరిశ్రమ ఏర్పాటుకు భూములిచ్చినందుకు గ్రామాల్లోని యువకులకు తగిన శిక్షణ ఇచ్చి ఉద్యోగాలు కల్పించాలన్నారు. ఫ్యాక్టరీ నుంచి వెలువడే దుమ్ము, ధూళి సమీపంలోని పంటలపై పడటంతో దిగుబడులపై ప్రభావం చూపుతోందన్నారు. టెక్నాలజీ సాయంతో వాటిని అరికట్టాలని కోరారు. బ్లాస్టింగ్ వల్ల సమీపంలోని గ్రామాల ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారని బ్లాస్టింగ్ సామర్థ్యాన్ని తగ్గించాలన్నారు. ఫ్యాక్టరీ పరిధిలోని గ్రామాల్లో ఇంకా మిగులు భూమి ఉందని వాటిని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. సీఎస్ఆర్ నిధులతో తమ గ్రామాల అభివృద్ధికి రామ్‌కో సిమెంట్ కంపెనీ కృషి చేస్తుందని మరి కొందరు రైతులు అభిప్రాయపడ్డారు. ఇక్కడి విద్యార్థుల కోసం నాణ్యత ప్రమాణాలతో కూడిన సీబీఎస్ఈ పాఠశాల ఏర్పాటు చేయాలని కోరారు. ఆసుపత్రి నిర్మాణం చేపడితే చుట్టు పక్కల గ్రామాల ప్రజలకు మరింత ఉపయోగకరంగా ఉంటుందని అధికారులకు విన్నవించారు.

దశల వారీగా పనులు

రైతులు తెలియజేసిన సమస్యలను దశల వారీగా పరిష్కరించుకుంటూ పోతామని రామ్‌కో యూనిట్ హెడ్ రెడ్డి నాగరాజు హామీ ఇచ్చారు. సీబీఎస్ఈ పాఠశాల ఏర్పాటు చేయాలని ఆలోచన ఉందని వాటికి ఎంత బడ్జెట్ అవుతుందో అంచనా వేస్తామన్నారు. రైతులకు ఇబ్బంది లేకుండా కాలుష్య నియంత్రణకు కృషి చేస్తామన్నారు. టెక్నాలజీ అందుబాటులోకి రావడం వల్ల మ్యాన్‌పవర్ తగ్గిపోతుందన్నారు. సభలో పలువురు ఇచ్చిన సలహాలను తప్పక పాటిస్తామని ఆయన అన్నారు. ప్రతి అంశాన్ని మినిట్స్ రూపంలో ప్రభుత్వానికి నివేదిక అందిస్తామని ఈ సందర్భంగా జేసీ చెప్పారు. ప్రజాభిప్రాయ సేకరణ సభ ప్రశాంతంగా ముగియడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. ఆళ్లగడ్డ డీఎస్పీ రవికుమార్ ఆధ్వర్యంలో భారీ బందో బస్తు ఏర్పాటు చేశారు.

ఆధునిక టెక్నాలజీ వాడాలి

పర్యావరణానికి ఎలాంటి హాని జరగకుండా ఆధునిక టెక్నాలజీని ఉపయోగించాలని జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి సూచించారు. ప్రజాభిప్రాయ సేకరణ సభకు ఆయన హాజరై మాట్లాడారు. కంపెనీ విస్తరణ జరిగాక స్థానికులకే ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. ముఖ్యంగా భూములిచ్చిన రైతుల పిల్లలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అలాగే శబ్ద కాలుష్యాన్ని నియంత్రించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ఫ్యాక్టరీ పరిధిలోని గ్రామాల్లో ఇంకా మిగులు భూములు ఉన్నాయని వాటిని యాజమాన్యం కొనుగోలు చేయాలని కోరారు. పరిశ్రమ విస్తరణకు రైతులందరి సహకారం ఉంటుందన్నారు. కొలిమిగుండ్ల మండలంలో చుట్టు 25 కిలో మీటర్ల మేర సున్నపురాయి నిక్షేపాలు ఉన్నాయన్నారు. ఇక్కడ మరెన్నో పరిశ్రమలు ఏర్పాటుకు వనరులు పుష్కలంగా ఉన్నాయని గుర్తు చేశారు. భవిష్యత్తులో సాగు, తాగునీటికి ఇబ్బందులు తలెత్తకుండా అవుకు రిజర్వాయర్ నుంచి పెట్నికోట సమీపంలో 25 టీఎంసీల నీరు నిల్వకు అవకాశం ఉందని, ఈవిషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి రిజర్వాయర్‌గా మార్చాలని జేసీకి విన్నవించారు.

10 నుంచి టెన్నిస్ డబుల్స్ టోర్నీ

తిరుపతి ఎడ్యుకేషన్: ఈ నెల 10 నుంచి 12వ తేదీ వరకు తిరుపతిలోని ఆఫీసర్స్ క్లబ్, టౌన్ క్లబ్‌లలో సనాల నాగముని మెమోరియల్ టెన్నిస్ డబుల్స్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు క్రీడా భారతి అసోసియేషన్ తిరుపతి జిల్లా కార్యదర్శి దండు రవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ టోర్నమెంట్‌కు 40 నుంచి 70ఏళ్ల పైబడ్డ రాయలసీమ జిల్లాలతో పాటు శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాల క్రీడాకారులు పాల్గొనవచ్చని తెలిపారు. 40 ప్లస్, 50 ప్లస్, 60ప్లస్, 70 ప్లస్ విభాగాల్లో ఈ పోటీలు నిర్వహిస్తామని, ప్రతి విభాగంలో విన్నర్స్‌కు రూ.5వేలు, రన్నర్స్‌కు రూ.3వేలతో పాటు ప్రతిభ చాటిన వారికి ప్రోత్సాహక బహుమతులు ఇవ్వనున్నట్లు తెలియజేశారు. వివరాలకు 94911 45556, 94402 45980, 94412 96125ను సంప్రదించాలన్నారు.

న్యూస్‌మేకర్స్



గ్రీన్ ఆర్మీ

ఉత్తరప్రదేశ్‌లో గతంలో 'గులాబ్ గ్యాంగ్' ఘనత విన్నాం. ఇప్పుడు 'గ్రీన్ ఆర్మీ'. స్త్రీల మీద జరిగే దురాగతాలను స్త్రీలే ఉమ్మడిగా ఎదిరిస్తూ బాధితులకు బాసటగా నిలుస్తున్నారు. వారణాసిలో క్రియాత్మకంగా ఉన్న 'గ్రీన్ ఆర్మీ' మహిళా బృందాన్ని ప్రధాని మోదీ ఇటీవలి మన్‌కీ బాత్‌లో ప్రశంసించారు.

ఇది ఓ జనతా గ్యారేజ్



వాళ్లంతా ఒక 50 మంది ఉంటారు. ఆకుపచ్చ చీరలో, చేతి కర్రతో వరుసగా నడుస్తూ ఊళ్లోకి వస్తారు. ఇక ఊళ్లోని మగాళ్లకు గుండె దడే. భార్యలను కొట్టే వాళ్లు, తాగుబోతులు, పేకాట రాయుళ్లు, మత్తు పీల్చేవాళ్లు, కట్నం కోసం వేధించే వాళ్లు... ఎక్కడికక్కడ సెట్‌రైట్ కావాల్సిందే. ఎందుకంటే వారు 'గ్రీన్ ఆర్మీ'. అందరి స్క్రూలు టైట్ చేసే ఆర్మీ. అందుకే మొన్నటి 'మన్ కీ బాత్'లో వీరి గురించి మోదీ ప్రత్యేకంగా ప్రస్తావిస్తూ 'వీరి ఆత్మనిర్భరతకు, కృషికి అభినందనలు. నూతన సంవత్సర శుభాకాంక్షలు' అని తెలిపారు. దాంతో గ్రీన్ ఆర్మీలో కొత్త జోష్ వచ్చింది.

వారణాసి చుట్టుపక్కల

గ్రీన్ ఆర్మీ 2014లో పుట్టింది. బెనారస్ హిందూ యూనివర్సిటీలో చదువుకున్న రవి మిశ్రా వారణాసి చుట్టుపక్కల పల్లెల్లో ముఖ్యంగా ఉత్తర ప్రదేశ్ ఉత్తర జిల్లాలలో గృహ హింస ఎక్కువగా ఉందని గమనించాడు. స్త్రీలకు సెల్ఫ్ డిఫెన్స్ నేర్పిస్తే వారు ఆత్మరక్షణ చేసుకోగలరని అనుకున్నాడు. కొందరు విద్యార్థులతో కలిసి నిర్మలాదేవి అనే గృహిణిని గృహ హింసను ప్రతిఘటించమని కోరాడు. రైతు కూలీగా ఆమె సంపాదించేదంతా ఆమె భర్త లాక్కుని తాగే వాడు. కొట్టేవాడు. నిర్మలా దేవి విద్యార్థుల స్ఫూర్తితో ఆత్మరక్షణ నేర్చుకుంది. అంతేకాదు గ్రామంలోని మరికొంతమందిని జమ చేసింది. అందరూ కలిసి ఇక గృహ హింసను ఏ మాత్రం సహించమని ఎలుగెత్తారు. అంతేకాదు.. కర్ర చేతబట్టి మాట వినని భర్తలకు బడితె పూజ చేశారు. నిర్మలాదేవి భర్త దారికొచ్చాడు. దాంతో గ్రీన్ ఆర్మీ పేరు వినపడసాగింది.

270 పల్లెల్లో...

వారణాసిలో, చుట్టుపక్కల జిల్లాల్లో ఇప్పుడు 270 గ్రామాల్లో గ్రీన్ ఆర్మీ ప్రతినిధులు ఉన్నారు. 2000 మంది స్త్రీలు ఇందులో భాగస్వాములు. ప్రతి ఊరిలో ఇరవై నుంచి యాభై మంది స్త్రీలు ఆకుపచ్చ చీరల్లో దళంగా మారి క్రమం తప్పక ఇంటింటికీ వెళ్లి సమస్యల ఆచూకీ తీస్తారు. వాటికి పరిష్కారాలు వెదుకుతారు. స్త్రీల మీద చెయ్యెత్తడం అనేది వీరు పూర్తిగా ఊళ్లల్లో నిర్మూలించారు. ఇక తాగుడు పరిష్కారం కోసం తాగుబోతులకు కౌన్సెలింగ్ ఇవ్వడం ప్రారంభించారు. పేకాట, డ్రగ్స్‌కైతే స్థానమే లేదు. గ్రీన్ ఆర్మీతో స్థానిక పోలీస్ కాంటాక్ట్‌లో ఉంటుంది. ఎవరైనా గ్రీన్ ఆర్మీకి ఎదురు తిరిగితే పోలీసులు వచ్చి చేయవలసింది చేస్తారు. వరకట్న సమస్య ఉత్తరప్రదేశ్‌లో ఎక్కువగా ఉంది. 'మీకు కట్నం ఎందుకు ఇవ్వాలి... సరంజామా ఎందుకివ్వాలి' అని గ్రీన్ ఆర్మీ ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. దాంతో గొంతెమ్మ కోరికలు పూర్తిగా తగ్గాయి. ఇచ్చింది పుచ్చుకుంటున్నారు.

ఆడపిల్లే అదృష్టం

కొన్ని జిల్లాల్లో ఇప్పటికీ ఆడపిల్ల పుడితే శోకం వ్యక్తం చేస్తారు. ఏడుస్తూ గుండెలు బాదుకుంటారు. కాని గ్రీన్ ఆర్మీ బయలుదేరి ఈ శోకానికి ముగింపు చెప్పింది. 'ఆడపిల్ల అంటే లక్ష్మి అని ఇంటికి భాగ్యమనీ బాగా చదివిస్తే సరస్వతి అని, శక్తిలో దుర్గ అని... ఆడపిల్లను మగపిల్లాడితో సమానంగా చూడాల'ని ఇంటింటికి తిరిగి చైతన్యం కలిగించారు. ఆడపిల్లకు జన్మనిచ్చిన తల్లులకు రక్షణగా నిలబడ్డారు. ఇవన్నీ సాంఘికంగా చాలా మార్పు తెచ్చాయి. అందుకే ఒక్కరు కాకుండా సమష్టిగా ప్రయత్నిస్తే విజయాలు వస్తాయి. గ్రామీణ జీవితంలో స్త్రీలకు ఇంకా ఎన్నో ఆటంకాలున్నాయి. తెలుగు రాష్ట్రాల్లో కూడా ఎన్నో సమస్యలు ఉన్నాయి. కర్రచేత బట్టి ఆర్మీగా మారకపోయినా స్త్రీలు సంఘాలు ఏర్పరుచుకుంటే సమస్యలు దూరం కాకపోవడం ఉండదు. గ్రీన్ ఆర్మీ ఇస్తున్న సందేశం అదే.

ఈత – ఘనత



55 ఏళ్లు.. 150 కిలోమీటర్లు

కొందరు ఓటమి నుంచి విజయాలు అందుకుంటారు. మరికొందరు తమ జీవితంలో ఎదురైన ప్రతిబంధకాల నుంచి బయటపడేందుకు ఏదో సాధించాలనే తపనతో ముందుకు సాగుతారు. ఆ కోవకు చెందిన వారే స్విమ్మర్ గోలి శ్యామల. సామర్లకోటకు చెందిన శ్యామల భర్త మోహన్ ఓ ప్రైవేట్ సంస్థలో ఉద్యోగి. కుమారుడితో కలిసి బతుకుదెరువు కోసం హైదరాబాద్‌లో యానిమేషన్ స్టూడియో పెట్టుకుని పలు సీరియళ్లు, సినిమాలకు పనిచేశారు. దురదృష్టవశాత్తూ స్టూడియో ద్వారా తీవ్రంగా నష్టపోవడంతో మానసికంగా మనోవేదనకు గురయ్యారు. దాంతో ఆరోగ్య సమస్యలు తలెత్తాయి. 45 ఏళ్ళ వయసులో శరీరం సహకరించని స్థితిలో మనసును మళ్ళించేందుకు హైదరాబాద్‌లో స్విమ్మింగ్ నేర్చుకున్నారు. స్వతహాగా ఆమె స్విమ్మర్ కాదు... అయితేనేం, నాటి మనోవేదనకు ఉపశమనంగా ప్రారంభించిన స్విమ్మింగ్ నేడు ఐదు పదుల వయసులో ఆమెను సముద్రాలు దాటే సాహస యాత్రికురాలిగా తీర్చిదిద్దింది.

150 కిలోమీటర్లు ఏడు రోజుల్లో అలవోకగా..

డిసెంబరు 28న విశాఖలోని ఆర్‌కే బీచ్ వద్ద సముద్ర తీరంలో ఈత ప్రారంభించిన శ్యామల శుక్రవారం కాకినాడ తీరం చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆమె సాక్షితో మాట్లాడుతూ యానిమేషన్ స్టూడియోలో నష్టం రావడంతో డిప్రెషన్‌లోకి వెళ్ళిపోయిన తాను మానసిక ఒత్తిడిని అధిగమించేందుకు స్విమ్మింగ్ ప్రారంభించాననీ, కోచ్ జాన్‌సిద్దిక్ సహకారంతో జీరో లెవెల్ నుంచి 150 కిలోమీటర్ల స్విమ్ చేసేలా తయారయ్యానని సగర్వంగా చెప్పారు. 2021లో శ్రీలంక నుంచి ఇండియా వరకు రామ్‌సేతు దాటానని, తాజాగా ఫిబ్రవరిలో లక్షద్వీప్‌లో స్విమ్ చేశానన్నారు. బంగాళాఖాతంలో 150 కిలోమీటర్లు ఈదడం ద్వారా ఆసియా స్థాయిలో ఘనత సాధించానన్నారు. విశాఖపట్నం నుంచి కాకినాడ వరకు ఈదాలని రెండేళ్ళ కిందటే నిర్ణయించుకున్నానని, అయితే రెండుసార్లు వాతావరణం అనుకూలించలేదనీ, ఎట్టకేలకు డిసెంబర్ 28న చిన్న ఫిషింగ్ బోట్, ఇద్దరు స్కూబా డ్రైవర్స్‌తో ప్రారంభించానన్నారు. ఆర్కే బీచ్‌లో సముద్రంలో ప్రవేశించాక మళ్ళీ కాకినాడలో నేలపైకి వచ్చామన్నారు. మొదటి రోజు 7 గంటల్లోనే 30 కిలోమీటర్ల దూరం ఈదానన్నారు. తరువాత నుంచి ఈరోజు వరకు అనేక ఒడుదొడుకులను అధిగమిస్తూ ఈదుకుంటూ వచ్చానన్నారు. తల వెంట్రుకల నుంచి కాలి గోళ్ల వరకు స్విమ్మింగ్ వల్లే ఆరోగ్యం కలుగుతుందని, స్విమ్మింగ్‌ను స్పోర్ట్స్‌గా కాకుండా సర్వైవల్ స్పోర్ట్స్‌గానే చెబుతానన్నారు. మహిళలు ఈత చేయడం వలన గైనిక్ సమస్యలు తగ్గుతాయన్నారు.

– లక్కింశెట్టి శ్రీనివాసరావు
సాక్షి ప్రతినిధి.. కాకినాడ.
ఫోటోలు: విశ్వనాధుల రాజబాబు.
కాకినాడ రూరల్



హేళన చేసిన వారే పొగుడుతున్నారు

సముద్రంలో ఈత కోసం తొలి ప్రయత్నం చేసినప్పుడు చాలామంది హేళన చేశారు. కొందరు యూట్యూబ్‌లో కామెంట్లు పెట్టారు. వాటిని పట్టించుకోలేదు. అరేబియా సముద్రం ఈదాను. శ్రీలంక నుంచి ఇండియా ఈత మరపురానిది. మోదీ స్ఫూర్తితో లక్షద్వీప్‌లో 18గంటల పాటు 48 కిలోమీటర్లు ఈదాను. వైజాగ్ నుంచి కాకినాడ 150 కిలోమీటర్లు ఈదగలిగినందుకు చాలా హ్యాపీగా ఉంది.

– గోలి శ్యామల – స్విమ్మర్.

ముగ్గు ముచ్చట



దామరాజు లక్ష్మి
ఆర్.ఆర్.పేట, ఏలూరు.

22 చుక్కలు, 10 వరసలు, 10 వచ్చే వరకు, చుక్క వదిలి చుక్క.







17 చుక్కలు, 5 వరసలు, 5 వచ్చే వరకు, సరి చుక్క.

బెన్నూరి ఉమాదేవి
సికింద్రాబాద్

ముగ్గులకు ఆహ్వానం

ముగ్గులు పంపవలసిన చిరునామా:
ముగ్గు-ముచ్చట, సాక్షి ఫ్యామిలీ, సాక్షి టవర్స్, రోడ్ నెం.1, బంజారాహిల్స్, హైదరాబాద్-34.
ఈ మెయిల్:
muggulu.sakshi@gmail.com



నగధగలు

బంగారం ఎక్కడైనా బంగారమే



ప్రపంచంలో ఏ దేశంలోనైనా బంగారం అత్యంత విలువైన లోహంగా గౌరవం అందుకుంటోంది. బంగారం స్వచ్ఛత గురించి ఒక్కొక్క దేశంలో ఒక్కొక్క నిష్పత్తిని అనుసరిస్తుంటారు. స్వచ్ఛమైన బంగారం అంటే 24 క్యారట్‌ల బంగారం. ఆభరణం తయారు చేయాలంటే కొన్ని ఇతర లోహాల మిశ్రమాన్ని బంగారంలో కలుపుతారు. బంగారం మెత్తటి లోహం. కాబట్టి ఆభరణం ఆకారం గట్టిదనం కోసం ఇతర లోహాలను కలపాలి. అలా లోహపు మిశ్రమాల కలయిక తర్వాత ఆభరణం తయారు చేయడానికి ఉపయోగించే బంగారం స్వచ్ఛత 22 క్యారట్‌లు ఉంటుంది.

- క్యారట్ అనే పదం అయోమయానికి గురి చేస్తుంది. బంగారం స్వచ్ఛత విషయంలో ఉపయోగించే క్యారట్ అనే పదం ఇంగ్లిష్ అక్షరం 'కె'తో సూచిస్తారు. మరో క్యారట్ రాళ్ల (వజ్రంతో సహా అన్ని రకాల రాళ్లు) బరువును సూచించే పదం. ఈ క్యారట్‌ను 'సి'తో అనే అక్షరంతో సూచిస్తారు. ఒక క్యారట్ అంటే 200 మిల్లీగ్రాములు.
- బంగారం ధర పెరగడం వల్ల ఆభరణాల తయారీలో 22 క్యారట్‌లకు బదులు 18, 14, 9 క్యారట్ స్వచ్ఛతతో ఆభరణాలు చేస్తున్నారు. క్యారట్ స్వచ్ఛత తగ్గేకొద్దీ గట్టిదనం పెరుగుతుంది. వజ్రాలు పొదిగే ఆభరణాలకు సాధారణంగా 18 క్యారట్ బంగారం ఉపయోగిస్తారు. ఇప్పుడు 9 క్యారట్ బంగారంతో కూడా వజ్రాల ఆభరణాలు చేస్తున్నారు.
- తక్కువ క్యారట్ బంగారు ఆభరణాలను కొంటే తిరిగి అమ్మేటప్పుడు ఆ బంగారానికి విలువ రాదనే అపోహ చాలామందిలో ఉంటుంది. నిజానికి మనం కొన్న ఆభరణంలో ఎంత నిష్పత్తి బంగారం ఉందో కరిగించినప్పుడు ఆ మేరకు బంగారమే తిరిగి వస్తుంది. బీఐఎస్ హాల్‌మార్క్ వేసిన 18 క్యారట్ బంగారాన్ని కరిగిస్తే 75 శాతం బంగారం వస్తుంది. అంతకంటే క్యారట్ తగ్గితే ఆ మేరకే బంగారం వస్తుంది. అంతే తప్ప తిరిగి ఏమీ రాదనేది అపోహ మాత్రమే. సర్టిఫికేట్‌లో ఆభరణంలో ఉన్న బంగారం స్వచ్ఛతతో పాటు క్యారట్ వివరం తాలూకు పర్సెంటేజ్ కూడా ఉంటుంది.



– విశేషిణి రెడ్డి,
జీఐఏ జెమ్మాలజిస్ట్

బ్యూటిప్

సిట్రస్ ఫ్రెష్‌నర్‌తో ముఖాన్ని శుభ్రం చేస్తుంటే రోజంతా తాజాగా ఉంటుంది. ఇందుకోసం రెండు కప్పుల నీళ్లు, నిమ్మరసం, నిమ్మతొక్కలు కావాలి. ఒక పాత్రలో నీటిని మరిగించి అందులో నిమ్మ తొక్కలను వేసి మూత పెట్టి రాత్రంతా అలాగే ఉంచాలి. మరుసటిరోజు ఉదయం నిమ్మతొక్కలను తీసివేసి ఆ నీటిలో తాజా నిమ్మరసాన్ని కలిపి స్ప్రే బాటిల్‌లో పోసుకోవాలి. దీనిని ముఖం మీద స్ప్రే చేసుకుని పది నిమిషాల తర్వాత తుడిచేయాలి. ఇలా చేస్తే ముఖం తాజాగా ఉంటుంది. స్ప్రే బాటిల్ తప్పనిసరి కాదు. ఈ మిశ్రమంలో దూదిని ముంచి ముఖానికి పట్టించినా కూడా సాంత్వన లభిస్తుంది. నిమ్మ తొక్కలకు బదులుగా ఆయా కాలాల్లో దొరికే కమలా, బత్తాయి వంటి పండ్ల తొక్కలను కూడా వాడుకోవచ్చు.

వంటిల్లు

అరిశెలు



కావలసినవి: బియ్యం – ఒక కిలో; బెల్లం పొడి – 800 గ్రా.; నువ్వులు, గసగసాలు– కొద్దిగా; నెయ్యి – కేజీ

తయారి:
- బియ్యాన్ని ముందు రోజు రాత్రి కడిగి నానబెట్టాలి. ఉదయాన్నే నీళ్లను వంపేసి తడిగా ఉన్నప్పుడే దంచాలి. దంచిన పిండిని జల్లించాలి. పిండి గాలికి పొడిబారకుండా ఒక పాత్రలో వేసి అదిమి మూత పెట్టాలి.
- ఇప్పుడు పాకం సిద్ధం చేసుకోవాలి. మందపాటి పాత్రలో ఒక గ్లాసు నీరు పోసి బెల్లం పొడి వేసి పాకం వచ్చేదాకా తెడ్డుతో కలుపుతూ మరిగించాలి. పాకం వచ్చిన తర్వాత స్టవ్ మీద నుంచి దించేసి బియ్యప్పిండి వేసి ఉండలు కట్టకుండా తెడ్డుతో కలపాలి.
- బాణలిలో నెయ్యి పోసి కాగనివ్వాలి. పాకంపిండిని పెద్ద నిమ్మకాయంత తీసుకుని గసాలు, నువ్వులలో అద్ది పాలిథిన్ పేపర్ మీద పెట్టి వేళ్లతో వలయాకారంగా అద్ది కాగిన నెయ్యిలో వేసి దోరగా కాలిన తర్వాత తీసి అరిశెల పీట మీద వేసి అదనంగా ఉన్న నెయ్యి కారిపోయేటట్లు వత్తాలి.

గమనిక: అరిశె మెత్తగా రావాలంటే పాకం లేతగా ఉన్నప్పుడే బియ్యప్పిండి కలుపుకోవాలి. గట్టిగా ఎక్కువ తీపితో కావాలనుకుంటే ముదురు పాకం పట్టాలి.
- ఈ అరిశెలు పదిహేను రోజుల వరకు తాజాగా ఉంటాయి.

నువ్వుల కజ్జికాయ



కావలసినవి: మైదా లేదా గోధుమ పిండి – కేజీ; నువ్వులు – కేజీ; బెల్లం పొడి – 800 గ్రా.; ఏలకులు– 10 గ్రా. జీడిపప్పు– వందగ్రాములు; నూనె– కేజీ;

తయారి:
- పిండిని చపాతీలకు కలుపుకున్నట్లుగా కలుపుకుని పక్కన ఉంచుకోవాలి.
- నువ్వులను దోరగా వేయించి చల్లారిన తర్వాత కాస్త పలుకుగా గ్రైండ్ చేయాలి. బెల్లం పొడి, యాలకుల పొడి వేసి అన్నీ సమంగా కలిసే వరకు కలపాలి.
- గోధుమ పిండిని చిన్న గోళీలుగా చేసుకోవాలి. ఒక్కొక్క గోళీని ప్రెస్సర్‌తో పూరీలా వత్తుకుని దానిని సాంచా (కజ్జికాయ చేసే చెక్క మౌల్డ్) లో పరిచి ఒక స్పూను నువ్వులు, బెల్లం మిశ్రమాన్ని, ఒక జీడిపప్పును పెట్టి సాంచా మూత వేయాలి.
- సాంచాలో నుంచి తీసి కజ్జికాయను మరుగుతున్న నూనెలో వేసి దోరగా కాలనివ్వాలి.

ఇవి దాదాపుగా ఇరవై రోజుల వరకు తాజాగా ఉంటాయి.

కల్లోల కాలం



ఆ అమ్మ సునామీకి జన్మనిచ్చింది!



సునామీ రాయ్, నమిత రాయ్

ఎప్పుడూ చూసే సముద్రమే ఆ రోజు కొత్తగా ఉంది. భయంగా ఉంది. ఎప్పుడూ నవ్వుతూ పలకరించే సముద్రం విలయవిధ్వంసానికి సిద్ధంగా ఉంది. ఆరోజు... ఏ రోజూ మరచిపోలేని రోజు. సునామీ విశ్వరూపాన్ని చూపిన రోజు. ఇరవై సంవత్సరాల తరువాత కూడా... నిన్ననే జరిగినట్లు వెన్నులో చలిపుట్టించే రోజు...

అండమాన్ నికోబార్‌లోని హట్ బే దీవిలో భీకర అలల ధాటికి నమిత రాయ్ ఇల్లు పూర్తిగా దెబ్బతిన్నది. అప్పుడు నమిత వయసు పాతిక సంవత్సరాలు. దిక్కుతోచని పరిస్థితుల్లో పాములకు ప్రసిద్ధి చెందిన అడవిలో ఆశ్రయం పొందారు. ఎటు నుంచి ఏ విషసర్పం వచ్చి ప్రాణం తీస్తుందో తెలియని భయానక పరిస్థితి. అలాంటి పరిస్థితుల్లోనే ఆ పాముల అడవిలోనే పండంటి పిల్లాడికి జన్మనిచ్చింది నమిత.

ఆ పిల్లాడికి 'సునామీ' అని పేరు పెట్టారు.

రెండు దశాబ్దాల తరువాత మళ్లీ ఆ రోజుల్లోకి వెళ్లింది నమిత రాయ్...

'ఆ చీకటి రోజును గుర్తు చేసుకుంటే ఇప్పటికీ ఒంట్లో వణుకు పుడుతుంది. అప్పుడు నేను గర్భవతిని. రోజువారీ పనులతో బిజీగా ఉన్నాను. ఉన్నట్టుండి భయంకరమైన నిశ్శబ్దం ఆవరించింది. మా తీరం నుండి మైళ్ళ దూరంలో సముద్రం తగ్గుముఖం పట్టడం చూసి షాక్ అయ్యాను. కొన్ని సెకనుల తరువాత మా దీవి వైపు భారీ సముద్రపు అలలు దూసుకొస్తున్నాయి, ఆ తర్వాత బలమైన ప్రకంపనలు వచ్చాయి. ప్రజలు కేకలు వేస్తూ గుట్ట వైపు పరుగెత్తడం చూశాను. పానిక్ ఎటాక్ వచ్చి స్పృహ తప్పి పడిపోయాను.

కొన్ని గంటల తరువాత స్పృహలోకి వచ్చాను. కొండ అడవిలో వేలాది మంది స్థానికుల మధ్య నేను ఉన్నాను. నా భర్త, పెద్ద కొడుకును చూడగానే ప్రాణం లేచి వచ్చింది. మా ద్వీపంలోని చాలా ప్రాంతాలు రాక్షస అలల తాకిడికి నాశనం అయ్యాయి. ఆస్తి అనేది లేకుండా పోయింది.

ఒకరోజు రాత్రి పదకొండు గంటల తరువాత నాకు పురిటినొప్పులు వచ్చాయి. కానీ చుట్టుపక్కల డాక్టర్లు ఎవరూ లేరు. నేను ఒక బండరాయిపై పడుకొని సహాయం కోసం ఏడ్చాను. నా భర్త ఎంత ప్రయత్నించినా వైద్యసహాయం అందలేదు. అడవిలో ఆశ్రయం పొందిన కొందరు మహిళలను నా భర్త వేడుకున్నాడు. వారి సాయంతో అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో సునామీకి జన్మనిచ్చాను.

తిండి లేదు. సముద్రానికి భయపడి అడవి నుండి బయటకు వచ్చే పరిస్థితి లేదు. ఈ పరిస్థితుల్లో నా బిడ్డ బతుకుతాడా అనే బాధ మొదలైంది. కొబ్బరి నీళ్లే ఆహారమయ్యాయి. లాల్ టిక్రీ హిల్స్‌లో నాలుగు రాత్రులు గడిపిన మమ్మల్ని రక్షణ సిబ్బంది కాపాడారు. చికిత్స కోసం నన్ను పోర్ట్ బ్లెయిర్‌లోని జీబీ పంత్ ఆసుపత్రికి ఓడలో తీసుకువెళ్లారు. హట్ బే నుంచి పోర్ట్ బ్లెయిర్‌కు 117 కిలోమీటర్‌ల దూరం. సుమారు ఎనిమిది గంటల సమయం పట్టింది' అంటూ గతాన్ని గుర్తు చేసుకుంది నమిత.

కోవిడ్ మహమ్మారి సమయంలో భర్త లక్ష్మీ నారాయణ మరణించడంతో ఇద్దరు కుమారులు సౌరభ్, సునామీలతో కలిసి పశ్చిమబెంగాల్‌లోని హుగ్లీలో నివసిస్తుంది నమితా రాయ్.

నమిత పెద్ద కుమారుడు సౌరభ్ ఒక ప్రైవేట్ షిప్పింగ్ కంపెనీలో పనిచేస్తున్నాడు. చిన్న కుమారుడు సునామీ 'ఓషనోగ్రాఫర్' కావాలనుకుంటున్నాడు.

'మా అమ్మే నాకు సర్వస్వం. ఆమె ధైర్యశాలి. నాన్న చనిపోయాక మమ్మల్ని పోషించడానికి చాలా కష్టపడింది. ఫుడ్ డెలివరీ సర్వీసును నిర్వహించింది. దానికి సునామీ కిచెన్ అని సగర్వంగా పేరు పెట్టింది' అంటున్నాడు సునామీ రాయ్.

'2004లో సమర్థవంతమైన హెచ్చరిక వ్యవస్థ లేకపోవడంతో పెద్ద ఎత్తున విధ్వంసం, ప్రాణ నష్టం జరిగింది. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా 1.400కు పైగా హెచ్చరిక కేంద్రాలు(వార్నింగ్ స్టేషన్స్) ఉన్నాయి. సునామీ నాటి పరిస్థితిని ఎదుర్కొనేందుకు మేము సర్వసన్నద్ధంగా ఉన్నాం' అంటున్నారు అండమాన్ నికోబార్ దీవుల అడ్మినిస్ట్రేషన్ సీనియర్ అధికారులు.